RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 300 | సంపుటి 4 | ఆదివారం | 02-08-2026 | పేజీలు 4 | వెల 3/-

ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి

- కమ్యూనిటీ పోలీసింగ్ కు ప్రాధాన్యం ఇవ్వాలి
- వరంగల్ సీపీ ఎన్. శ్వేత
- సంగెం పీఎస్ లో ఆకస్మిక తనిఖీ

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో:

వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత శనివారం ఈస్ట్ జోన్ పరిధిలోని సంగెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిపాలన, రికార్డుల నిర్వహణ, నేరాల దర్యాప్తు, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సంగెం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూర్ ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, సంగెం ఎస్ఐ వంశీకృష్ణ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన సీపీ, స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కను నాటి హరితహారం కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. తదుపరి పోలీస్ స్టేషన్ ఆవరణ, స్టోర్‌రూమ్‌లు, మాల్ఖానా, స్టేషన్ రికార్డులు, కేసు ఫైళ్లు, ఆయుధాగారం, పోలీసు సిబ్బందికి వ్యక్తిగతంగా మంజూరు చేసిన కిట్లు, ఇతర పరిపాలనా విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమై శాఖాపరమైన సమస్యలు, విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాల స్వభావం, పెండింగ్ కేసుల విచారణ, దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలు, విజిబుల్ పోలీసింగ్, రాత్రి పెట్రోలింగ్, శాంతిభద్రతల నిర్వహణ వంటి అంశాలపై సంగెం ఎస్ఐ వంశీకృష్ణ నుంచి వివరాలను సీపీ సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడు తూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారు, బాధితుడితో మర్యాదపూర్వకంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజల సమస్యలను పూర్తిగా తెలుసుకుని చట్టబద్ధంగా, వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం, భద్రత, భరోసా పెంపొందేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించా రు. కమ్యూనిటీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని, విధి నిర్వహణలో ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతికి తావు లేకుండా పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. డయల్-100కు వచ్చే అత్యవసర కాల్స్‌పై వెంటనే స్పందించి సంఘటన స్థలానికి సకాలంలో చేరుకుని బాధితులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. పోలీసు సిబ్బందికి విధి నిర్వహణలో లేదా వ్యక్తిగతంగా ఎదురయ్యే సమస్యలను నిర్భయంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూర్ ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, సంగెం ఎస్ఐ వంశీకృష్ణ, పర్వతగిరి ఎస్ఐ ప్రవీణ్, ఐనవోలు ఎస్ఐ అశోక్ కుమార్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్టుబడులు లక్ష్యంగా

సీఎం విదేశీ టూర్

- ఈనెల 20 నుంచి పది రోజుల పర్యటన

హైదరాబాద్, ప్రభాతగమనం :

తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆగస్టు 20 నుంచి సెప్టెంబరు 8 వరకు దాదాపు 20 రోజులపాటు వివిధ దేశాల్లో సీఎం పర్యటించనున్నారు. అమెరికా, యూకే సహా మరికొన్ని కీలక దేశాలకు ఆయన వెళ్లనున్నట్టు సమాచారం. సీఎం టూర్ షెడ్యూల్ ఆగష్టు 20-23 తేదీల మధ్య ఉండవచ్చని అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ పర్యటనలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి సంస్థలు, ప్రవాస భారతీయులతో సీఎం సమావేశాలు నిర్వహించనున్నారు. ఐటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, సెకండర్లర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం టూర్ ఉండొచ్చని సమా చారం. అమెరికాలో చిప్ తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ కంపెనీలతో, లండన్‌లో గ్లోబల్ ఫైనాన్షియల్ ఇన్వెస్టర్లు, విద్యా సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపే అవకాశం ఉంది. చట్టసభల్లోకి ప్రవేశించే వయసును 21కి తగ్గించాలనే అంశంపై తీర్మానం చేసేందుకు ఆగష్టు 17-18 తేదీల్లో ఒక రోజు ప్రత్యేక అసెంబ్లీ సెషన్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఇక వర్షాకాల సమావేశాలను సెప్టెంబరు మూడో వారంలో వారంపాటు నిర్వహిం చే అవకాశం ఉందని సమాచారం. సెప్టెంబరు రెండో వారం వరకు ఆయన తిరిగి రాష్ట్రానికి వస్తారని, మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలు ఉంటాయనే చర్చ సచివాలయంలో జరుగుతోంది.

కొత్త శిఖరాలకు ఆర్థికాభివృద్ధి

- తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిక
- ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు
- పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి పెరుగుదలతో రాష్ట్రం ముందంజ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, ప్రభాతగమనం :

తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విధానపరమైన పాలన, పారదర్శక నిర్ణయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా సాగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు ముఖ్యంగా మహిళలు, రైతులు, యువతకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్దంలో నెలకొన్న నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపామని, తెలంగాణను దేశంలో అభివృద్ధికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో తెలంగాణ మరింత పురోగతి సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈజీఎస్ సమ్మెతో మాకు సంబంధం లేదు

- స్పష్టం చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ అధ్యక్షుడు హనుమంతు
- ఎంపీడీవో మంగమ్మకు వినతిపత్రం అందజేత

గార్ల, ఆగస్టు 1(ప్రభాత గమనం):

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఇతర ఉద్యోగులు చేపట్టిన సమ్మెతో తమకు ఎలాంటి సంబంధం లేదని, తాము యథాతథంగా విధులకు హాజరవుతున్నామని గార్ల మండల ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ స్పష్టం చేసింది. ఈ మేరకు శనివారం మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో మంగమ్మకు యూనియన్ అధ్యక్షుడు హనుమంతు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు హనుమంతు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ వీబీజీ రాంజీ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఏపీఓ, సీటీఏ, సీఓ ఉద్యోగులు పే-స్కేల్ అమలు చేయాలని, నిలిచిపోయిన రెండు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు జూలై 31 నుంచి ఆగస్టు 4 వరకు 'పెన్ డౌన్-షట్ డౌన్' నిరసనలు తెలుపుతున్నారన్నారు. అయితే, గార్ల మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఎవరూ ఈ సమ్మెలో పాల్గొనడం లేదని స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా కూడా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం ఈ సమ్మెకు దూరంగా ఉంటూ క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తోందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ మండల ఉపాధ్యక్షులు మేకల లక్షి , మాధురి, సంఘం ప్రతినిధులు ఆంగోత్ శంకర్, రాంబాబు, రామ్ లాల్, సుధాకర్, యేసు, భూక్య హరికిషన్, లాల్, మల్లికార్జున్, మత్రు, వీరు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సదరం యూడీఐడీ కార్డుల జారీని వేగవంతం చేయాలి

- అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం-యూడీఐడీ కార్డులు అందేలా చర్యలు
- వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

మహబూబాబాద్ ఆగస్టు 1(ప్రభాత గమనం):

అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం - యూడీఐడీ కార్డులు సకాలంలో అందేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సెర్ప్ సీఈఓ దివ్య సదరం -యూడీఐడీ కార్డుల జారీ పురోగతిపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా గ్రామీణాభి వృద్ధి అధికారులు, ముఖ్య వైద్యాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. సదరం-యూడీఐడీ కార్డుల జారీ పురోగతి, జిల్లాల వారీగా నమోదవుతున్న దరఖాస్తులు, పెండింగ్ కేసులు, కేంద్రాల పనితీరు, మౌళిక వసతులపై సెర్ప్ సీఈఓ వీసీ ద్వారా సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ...ప్రభుత్వం సదరం-యూడీఐడీ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులలో అర్హులైన వారందరికీ సదరం ధృవపత్రాల జారీని వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం - యూడీఐడీ కార్డులు అందేలా క్షేత్రస్థాయిలో చురుకుగా పని చేయాలని సూచించారు. జిల్లాలో యూడీఐడీ మూల్యాంకన కేంద్రంలో అవసరమైన పరికరాలు, స్పెషలిస్ట్ వైద్యులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకుని దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సకాలంలో సదరం-యూడీఐడీ ధృవ పత్రాలు జారీకి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో (ఇంచార్జ్) అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, హౌసింగ్ పీడీ పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఎల్లంపల్లి'కి జలకళ

- పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువలో రిజర్వాయర్
- సందర్శకులను అనుమతించని అధికారులు

హైదరాబాద్, ప్రభాతగమనం :

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో హాజీపూర్ మండలంలోని గుడిపేట సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టు అందాలను వీక్షించి ఆనందించాలనుకునే సందర్శకులకు మాత్రం నిరాశే ఎదురవుతోంది. గేట్ల ఎత్తివేత నేపథ్యంలో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వెళ్లే మార్గంలో గుడిపేట చేపల మార్కెట్ వద్ద పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి ఎవరినీ అనుమతించడం లేదు. దీంతో ప్రాజెక్టు చూసేందుకు వచ్చిన సందర్శకులు అసహనంతో వెనుదిరిగిపోతున్నారు. దీంతో స్థానికులు పర్యాటకులు పోలీసులు, నీటిపారుదల శాఖల తీరుపై మండిపడుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం అనంతరం అవతలి వైపున ఉన్న పెద్దపల్లి జిల్లాకు చిన్న వాహనాల రాకపోకలకు అనుమతులు ఇవ్వడంతో ఈ మార్గం ద్వారా ప్రతి రోజు వందలాది మంది ప్రయాణిస్తున్నారు. రామగుండంలోని ఎన్టీపీసీకి విధులకు హాజరయ్యే ఉద్యోగులు కూడా ఈ మార్గాన్నే ఎక్కువగా వినిగియోస్తుంటారు. పెద్దపల్లి జల్లాలో పనిచేసే కూలీలు, ఇతర కార్మికులు సైతం నిత్యం ఈ ప్రాజెక్టు మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. పాలవ్యాపారులు కూడా ప్రతిరోజు పదుల సంఖ్యలో మంచిర్యాల జిల్లా కేంద్రానికి ఈమార్గం ద్వారానే వెళ్తుంటారు. ప్రస్తుతం ప్రాజెక్టు పైకి వెళ్లేందుకు ఆంక్షలు విధించడంతో వీరంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం

హైదరాబాద్ ఆగస్టు 01(ప్రభాత గమనం):

గోదావరిలో వరద ఉధృతి క్రమంగా పెరుగుతున్న నేప థ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ క్షేత్ర స్థాయిలో పర్యటించి.. లోతట్టు ప్రాంత వాసులను పునరా వాస కేంద్రాలకు తర లించాలని అధికారు లను ఆదేశించారు. వరద నీటిమట్టం పెరగడంతో దమ్మాయిగూడెం- భద్రాచలం మధ్య శుక్రవారం సాయం త్రం నుంచి రాకపోక లు నిలిపి వేశారు. గోదావరిలో వరద ఉధృతి కారణంగా దుమ్ముగూడెం మండ లంలోని పర్ణశాల వద్ద స్నానఘట్టాలు, సీత వాగు వద్ద సీతమ్మ నారచీరలు, స్వామి వారి సింహాసనం, ఐరన్ ఫుట్ బ్రిడ్జి నీటమునిగాయి. కూనవరం వద్ద గోదావరి నీటిమట్టం 19.20 మీటర్లకు చేరగా.. పోలవరం వద్ద 11.96 మీటర్ల మేర ప్రవహిస్తోంది.

ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం

- భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

ప్రభాతగమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్–2026 కార్యక్రమాన్ని జూలై 1 నుండి జూలై 31, 2026 వరకు జిల్లావ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, బాల కార్మికులు, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను గుర్తించి మొత్తం 48 మంది చిన్నారులను రక్షించడం జరిగింది. వీరిలో 06 మంది బాలికలు, 42 మంది బాలురు ఉన్నారు. రక్షించిన చిన్నారులను సంబంధిత అధికారుల సమక్షంలో వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు అప్పగించగా, అవసరమైన వారికి పునరావాస చర్యలు చేపట్టడం జరిగింది. ఆపరేషన్ సందర్భంగా బాల కార్మికులను పనిలో పెట్టుకున్నట్లు గుర్తించిన 12 మంది యజమానులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయడం జరిగింది. భవిష్యత్తులో కూడా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు కొనసాగిస్తూ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో జిల్లా పోలీసు శాఖతో పాటు కార్మిక శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, బాలల సంక్షేమ కమిటీ చైల్డ్‌లైన్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేశాయి. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు, వీధి బాలలు లేదా ప్రమాదంలో ఉన్న చిన్నారులు కనిపిస్తే వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని జిల్లా పోలీసు శాఖ ప్రజలను కోరింది.

బాధితుడికి పోగొట్టుకున్న ఐఫోన్ అప్పగింత

ప్రభాతగమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

కాజీపేట ట్రాఫిక్ పోలీసుల అప్రమత్తతతో పోగొట్టుకున్న విలువైన ఐఫోన్ తిరిగి యజమానికి చేరింది. కాజీపేట జంక్షన్‌లో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ట్రాఫిక్ ఎస్ఐ బి. మంగా ఆధ్వర్యంలోని పోలీసు సిబ్బందికి ఒక ఆపిల్ మొబైల్ ఫోన్ లభించింది. ఫోన్‌కు సంబంధించిన వివరాలను సేకరించి యజమానిని గుర్తించగా, అది కాజీపేట బాపూజీనగర్‌కు చెందిన గుండా అభినవ్‌దిగా నిర్ధారణ అయింది. అనంతరం అవసరమైన ధృవీకరణ ప్రక్రియ పూర్తి చేసి మొబైల్ ఫోన్‌ను బాధితుడికి అప్పగించారు. తన పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ తిరిగి లభించడంతో గుండా అభినవ్ కాజీపేట ట్రాఫిక్ ఎస్ఐ బి. మంగా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి. వెంకన్నతో పాటు పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాజీపేట ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ, ప్రజలు తమ మొబైల్ ఫోన్లు లేదా ఇతర విలువైన వస్తువులు పోయిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సకాలంలో సమాచారం అందిస్తే పోయిన వస్తువులను గుర్తించి తిరిగి అప్పగించే అవకాశం మరింత పెరుగుతుందని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

సేవలు చిరస్మరణీయం

- కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎర్రబెల్లి స్వర్ణ, ఎంపీ డా. కడియం కావ్య

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీనియర్ రాజకీయ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం నల్లబెల్లిలోని ఆయన నివాసానికి వెళ్లిన వారు పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ఆయన సతీమణి పెద్ది స్వప్నతో పాటు కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని మనోధైర్యం కల్పించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ, సామాజిక రంగాలకు తీరని లోటని పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజా జీవితంలో ఎన్నో దశాబ్దాల పాటు ప్రజలతో మమేకమై పనిచేశారని, నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ఆయన రాజకీయ జీవితంలో ప్రజాసేవకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, అన్ని వర్గాల ప్రజల అభిమానాన్ని సంపాదించిన నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ, సమస్యలను ఓపికగా విని

పరిష్కరించేందుకు కృషి చేసిన నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. ఆయన చూపిన ప్రజాసేవా మార్గం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రధాన రహదారి పక్కన

ముళ్లపొదల తొలగింపు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని దామెర గ్రామం నుంచి ఒగ్లాపూర్ గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న మూల మలుపుల వద్ద ప్రమాదాల నివారణ కోసం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో రహదారికి అడ్డుగా ఉన్న చెట్లపొదలను తొలగించారు. దామెర ఎస్ఐ ఇమ్మడి వీరభద్రరావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, వాహనదారుల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించే ఉద్దేశంతో మూల మలుపుల వద్ద దృశ్యమానతను పెంచేందుకు చెట్ల పొదలను తొలగించినట్లు చెప్పారు. వాహనదారులు వేగ పరిమితులు పాటిస్తూ, మూల మలుపుల వద్ద అప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గార్లలో శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను ఆపాలి

- ఎస్సీఆర్ జనరల్ మేనేజర్‌కు ఎంపీ బలరాం నాయక్ వినతి
- గార్ల రైల్వే స్టేషన్‌ను 'అమృత్ భారత్' పథకంలో చేర్చాలని విజ్ఞప్తి
- రైల్వే ఉన్నతాధికారులకు లేఖ రాసిన మహబూబాబాద్ ఎంపీ

గార్ల , ఆగస్టు 1 (ప్రభాత గమనం):

గార్ల రైల్వే స్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ ను నిలిపేలా చర్యలు తీసుకోవాలని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ తో పాటు సంబంధిత అధికారులకు శనివారం ఆయన లేఖ రాశారు.సీనియర్ కాంగ్రెస్ నాయకులు ధనియాకుల రామారావు ఆధ్వర్యంలో ఈ ప్రతిపాదనను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్ రైల్వే జీఎంతో ఫోన్‌లో మాట్లాడి, గార్ల ప్రజల సుదీర్ఘకాల విన్నపాన్ని తక్షణమే పరిష్కరించాలని కోరారు.విజయవాడ – సికింద్రాబాద్ మధ్య ప్రయాణించే శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను గార్ల ఏజెన్సీ ప్రాంత రైల్వే స్టేషన్‌లో వెంటనే ఆపేలా ఆదేశాలు జారీ చేయాలని ఎంపీ కోరారు.సికింద్రాబాద్ నుండి విజయవాడ మార్గంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న ఏకైక స్టేషన్ గార్ల మాత్రమేనని స్పష్టం చేశారు. అందువల్ల ఈ స్టేషన్‌ను కేంద్ర ప్రభుత్వ 'అమృత్ భారత్ పథకం' కింద ఎంపిక చేసి సర్వాంగ సుందరంగా ఆధునీకరించాలని విజ్ఞప్తి చేశారు.రాబోయే రోజుల్లో గార్ల రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన తాగునీరు, షెడ్లు, ప్లాట్‌ఫారమ్ మెరుగుదల వంటి ప్రాథమిక మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఈ విషయమై ఎంపీ క్యాంప్ కార్యాలయం నుండి లేఖ ను రైల్వే ఉన్నతాధికారులకు పంపడంతో పాటు ప్రెస్ అండ్ మీడియాకు విడుదల చేసినట్లు ధనియాకుల రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో

నాయకులు గోసు నాగేశ్వరరావు మరియు తదితరులు పాల్గొని గార్ల రైల్వే స్టేషన్ ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు వివరించారు.

బైక్ చోరీల నిందితుడు అరెస్ట్

- నాలుగు ద్విచక్ర వాహనాల స్వాధీనం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, అతని వద్ద నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ కాలనీకి చెందిన తోటపల్లి రాజు (40) ఈ చోరీలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం, నిందితుడికి గతంలో కూడా కాజీపేట, మట్వాడ, కేయూసీ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీ కేసులు నమోదయ్యాయి. వ్యక్తిగత అవసరాల కోసం సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో పార్క్ చేసిన మోటార్‌సైకిళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. ఇటీవల పెరుగుతున్న బైక్ చోరీలపై ప్రత్యేక దృష్టి సారించిన కాజీపేట పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారాన్ని విశ్లేషించి నిందితుడిని గుర్తించారు. కాజీపేట సీఐ శ్యామ్‌సుందర్ ఆదేశాల మేరకు ఎస్ఐలు బి. శివ, మౌనికా రెడ్డి, యాదగిరి, క్రైమ్ టీమ్ సభ్యులు వీ. క్రాంతికుమార్, జీ. కుమారస్వామి ప్రత్యేక బృందంగా గాలింపు నిర్వహించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసును త్వరితగతిన ఛేదించి చోరీకి గురైన నాలుగు బైకులను స్వాధీనం చేసుకున్న పోలీసు బృందాన్ని కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి అభినందించారు. ప్రజల భద్రత కోసం నేరాల నియంత్రణలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు పోలీసులు పలు సూచనలు చేశారు. వాహనాలను భద్రత కలిగిన ప్రదేశాల్లోనే పార్క్ చేయాలని, తప్పనిసరిగా తాళాలు వేయాలని సూచించారు. రైల్వే స్టేషన్ పరిసరాల్లో అనధికారిక పార్కింగ్ చేయరాదని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. స్థానిక ప్రజలు కేసును త్వరగా ఛేదించి వాహనాలను స్వాధీనం చేసిన పోలీసు బృందాన్ని అభినందించారు.

పాత్‌ఫైండర్ స్కూల్ లో మాక్ ఎన్నికల నిర్వహణ

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

ఐనవోలు గ్రామంలోని పాత్‌ఫైండర్ హై స్కూల్ లో విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు మరియు బాధ్యతాయుత పౌరసత్వ భావన పెంపొందించేందుకు హెడ్ బాయ్, హెడ్ గర్ల్ మాక్ ఎన్నికలు శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల డైరెక్టర్ డా. ఎల్.ఎన్. ఎన్. వెంకటేశ్వరరావు హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించి, భవిష్యత్తులో బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు.పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.డి. సుభానుద్దీన్ మాట్లాడుతూ, పాఠశాల స్థాయిలో ఇటువంటి మాక్ ఎన్నికలు నిర్వహించడం ద్వారా విద్యార్థులు ఎన్నికల విధానం, ప్రచారం, ఓటింగ్ ప్రక్రియ మరియు ఫలితాల ప్రకటన వంటి అంశాలను ప్రత్యక్షంగా అవగాహన చేసుకుంటారని తెలిపారు.ఈ ఎన్నికల్లో ఉపాధ్యాయులు ఎన్నికల అధికారులుగా బాధ్యతలు నిర్వర్తించగా, విద్యార్థులు అభ్యర్థులు మరియు ఓటర్లుగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓటింగ్ ప్రక్రియను క్రమశిక్షణతో నిర్వహించడం విశేషంగా నిలిచిందన్నారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

రోడ్డు భద్రత మన అందరి బాధ్యత

- సురక్షితంగా ఇంటికి చేరుదాం
- వాహన తనిఖీలు నిర్వహించిన జిల్లా ఎస్పీ

ప్రభాతగమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న "అర్లైవ్ అలీవ్ – స్పెషల్ డ్రైవ్ " కార్యక్రమంలో భాగంగా శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను జిల్లా పోలీసు శాఖ మరియు రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల పత్రాలు,డ్రైవింగ్ లైసెన్స్,హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపడం,హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, ఇతర ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం చలాన్లు విధించారు. అలాగే నిబంధనలు ఉల్లంఘించిన 50 వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రతి ప్రయాణాన్ని సురక్షితంగా మార్చడమే ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీటుబెల్ట్ వినియోగించాలని, నిర్ణీత వేగ పరిమితులను పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. రోడ్డు భద్రత అనేది ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలను స్వచ్ఛందంగా పాటించి "అర్లైవ్ అలీవ్ – స్పెషల్ డ్రైవ్ " కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిటిఓ శ్రీనివాస్,భూపాలపల్లి డి.ఎస్.పి సంపత్ రావు, భూపాలపల్లి సిఐ నరేష్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు

చెరువుకు, మత్స్యకారులకు

ఎలాంటి నష్టం జరగదు

- రైల్వే డిప్యూటీ ఇంజనీర్...

మహబూబాబాద్ ఆగస్టు 1(ప్రభాత గమనం):

బంధం చెరువు మత్తడి నిర్మాణ పనులు చేపడుతున్న సందర్భంగా చెరువుకు గానీ, మత్స్యకారుల జీవనోపాధికి గానీ ఎలాంటి నష్టం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని రైల్వే డిప్యూటీ ఇంజనీర్ స్పష్టం చేశారు. బంధం చెరువు మత్తడి నిర్మాణ పనులను తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు పెద్ది సైదులు ముదిరాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులతో జరిగిన చర్చలో ముదిరాజ్ మహాసభ నాయకులు గతంలో సూచించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని పనులు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. పనులను మరింత మెరుగైన విధానంలో పూర్తి చేసి మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే రైల్వే శాఖ ప్రధాన లక్ష్యమని, అదే సమయంలో మహబూబాబాద్ పట్టణంలోని బంధం చెరువుపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల ప్రయోజనాలను కూడా దృష్టిలో ఉంచుకొని పనులు నిర్వహిస్తున్నామని డిప్యూటీ ఇంజనీర్ తెలిపారు. రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం తొలగించిన మత్తడిని పునర్నిర్మించి, అలుగు నీరు పాచి వాగులోకి సహజంగా వెళ్లే విధంగా మత్స్యకార నాయకులు సూచించిన మేరకు పనులను త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. రైల్వే ట్రాక్‌కు అనుసంధానంగా సుమారు 30 మీటర్ల మేర మత్తడి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మత్తడి సమీపంలో ఉన్న ముదిరాజుల గుడికి ఎలాంటి నష్టం కలగకుండా ప్రత్యేకంగా మెట్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా, రైల్వే శాఖ నిబంధనలకు అనుగుణంగా రెవెన్యూ, నీటిపారుదల, మున్సిపాలిటీ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనులు కొనసాగిస్తామని, మత్స్యకారులకు పూర్తి సహకారం అందిస్తామని రైల్వే అధికారులు స్పష్టం చేశారు.

హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నందాను కలిసిన సీపీ

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత శనివారం జనగామ జిల్లా ఆర్‌అండ్‌బీ (ఆర్‌అండ్ బీ) అతిథి గృహంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, జస్టిస్ సూరేపల్లి నందాకు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మర్యాదపూర్వకంగా పలకరించి, స్వల్పసేపు వివిధ అంశాలపై చర్చించారు.